ఓమ్

ఆర్యసమాజము

(స్వరూపము–కార్యకలాపములు)



హిందీ మూలము :– పండిత కృష్ణదత్త్ ఎం. ఏ.

అనువాదము :– లోక లక్ష్మీనారాయణ బి.ఎ,బి.ఇడి,

—: ప్రకాశకులు :—

వైదిక సాహిత్యమాల

ఆర్య సమాజము గోషామహల్–భాగ్యనగరము.ఆం.ప్ర.

కీ.: శే కొంగళ్ళ లక్ష్మయ్య- కేశమ్మ దంపతుల స్మృతిలో ప్రచురితము

కీ. శే. కొంగళ్ళ లక్ష్మయ్య—కేశమ్మ గార్ల జ్యేష్ఠ పుత్రులు డాక్టర్. ఆనందం **M.B B.S** గారు, వైదిక ధర్మానురాగులు. వృత్తి రీత్యా వైద్యరంగమున పనిజేస్తూ, పేద ప్రజలకు సహాయ పడుతూ ఉంటారు. వీరిది పెద్ద సంపన్న కుటుంబము సతీమణి శ్రీమతి అమృత బాయి ఉత్తమ ఇల్లాలు. పుత్రరత్నము అరవిందకుమార్.

శ్రీ. శ్రీరాములు—హెడ్ క్యాశియర్ **S.B H.**
శ్రీ సత్యనారాయణ— **M.V.I.** మరియు
శ్రీ కృష్ణ వీరి సహోదరులు.
శ్రీమతి కర్రె దేవేంద్రమ్మ మరియు
కీ॥ శే॥ ఓంకారమ్మ-సహోదరీమణులు

సోదరులంతా కలసి మెలసి కుటుంబ కార్యములను నిర్వహించడమే గాక సామాజిక, ధార్మిక కార్యములందు కూడ శ్రద్ధతో పాల్గొంటారు.

వీరి ద్రవ్య సహాయముతో ఈ పుస్తకము వెలువడింది. భగంతుడు వారికి ఆయురారోగ్య ఐశ్వర్యములను ప్రసాదించు గాక.

—సంపాదకులు.

మా మాట

మనమంతా శాంతి - సౌఖ్యముల నభిలషించేవారము. వాటిని పొందుటకు సత్యజ్ఞానము, సాధన అవసరం. నేటి యుగమందు విద్య-విజ్ఞానము లెంతయో అభివృద్ధి గాంచినవి. వాని సహాయమున సుఖసాధనములను సమకూర్చుకొనవచ్చు. యేనకేన ప్రకారేణ వాటిని సమకూర్చుకొనుటే జీవిత పరమావధియైపోయినది. అందుచేత సమాజంలో నీతి - బాహ్యమైన వ్యవహారము సాగుతూవుంది. శాంతి కరువై పోయినది. దీనికంతా కారణం - అజ్ఞానం - స్వార్థం.

వీటిని పారద్రోలుటకు సత్యజ్ఞానము - పరమార్థము నెరుగవలసిన ఆవశ్యకత ఎంతేని వుంది, ఈ సత్యము నెరిగిన మహర్షి దయానందులు సత్యజ్ఞానమునకు నిలయమైన వేద - విజ్ఞానమును వెదజల్లుటకు కంకణం కట్టుకున్నారు. తదాశయసిద్ధికై ఆర్యసమాజమును స్థాపించారు. మహర్షి అనుయాయు లెందరో చిత్తశుద్ధితో వేదప్రచారము కోసం దేశసేవకోసం అంకితమై పోయారు. కాని ప్రస్తుత పరిస్థితి వేరు. వేద ప్రచారము సన్నగిల్లుతూవుంది. అనుదినమూ విద్వాంసులు, ప్రచారకులు కరువై పోతున్నారు. సాహిత్య సృజన అంతకంటే కొరవడుతూ వుంది. ఇట్టి విషమపరిస్థితిని తిలకిస్తూ అభిమానము గల ఆర్యులు నిట్టూర్పు విడుస్తు న్నారు. ప్రయోజనం ?

అందుచే ఇట్టి తరుణంలో మనమంతా నిరాశా నిస్పృహలతో నిట్టూర్పు విడిచేకన్నా కర్తవ్యోన్ముఖుల మగుట ఎంతేని అవసరం. ఎవరేమిచేయుచున్నారు అని విమర్శించేముందు నేనేమిచేయుచున్నాను ? అని ప్రశ్నించుకుంటే బాగుంటుంది. చేతనైన నిర్మాణాత్మకమైన కృషి సలిపితే ప్రయోజనకారిగా వుంటుంది.

"వైదిక సాహిత్యమాల" :— పై అభిప్రాయముతో జనసామాన్య మందు ధర్మప్రచారార్థము తగు సాహిత్యమునందివ్వాలని తలపెట్టినాము. "వైదిక సాహిత్యమాల" యను శీర్షికన ఇట్టి సాహిత్యమును ప్రచురించ దలిచాము. ఇందు వేదోక్త, వేదసమ్మత అభిప్రాయములను వెలిబుచ్చు మూల రచనలు, అనువాదములు లఘుపుస్తకముల రూపమున ప్రచు రిస్తాము.

ఇంతవరకు "మీ హితము ఇందే నిహితమైయున్నది" మరియు "ఆరాధ్యు డెవరు" ? అను రెండు ప్రచరణలను మీకు అందించ గలిగాము. ఈ పవిత్ర కార్యము కొనసాగుటకు ధర్మాభిమానులంతా తగు సహకారము నందివ్వాలని ప్రార్థించుచున్నాము. రూ॥ 101/- చెల్లించి ధర్మ రక్షక సభ్యులుగాను, రూ॥ 51/— చెల్లించి ధర్మ పోషక సభ్యులుగాను, రూ॥ 25/— చెల్లించి ధర్మ సహాయక సభ్యులుగాను, రూ 11/— చెల్లించి ధర్మ మిత్ర సభ్యులుగాను చేరవలసిందిగా ఆహ్వా నించుచున్నాము. ఒక్కొక్క ప్రచురణ భారమంతా ఒకే వ్యక్తి లేదా సంస్థ భరించినట్లయితే, ఆ ప్రచురణ యందు వారి సంపూర్ణ పరిచయము ఇవ్వబడును.

"వైదిక సాహిత్యమాల" సురభిత కుసుమముల నాఘ్రాణింప జేయుటకు మా యీ ప్రణాళిక మీ కందరికి నచ్చుతుందనే విశ్వాసంతో మీ సహాయ సహకారములు తప్పకుండా లభించగలవనే ఆశతో—

భవదీయులు

లోకుల భర్తయ్య గుప్త — సంరక్షకులు

ప్రేమరాజ్ "ప్రేమ్"
ఆర్. రామచంద్ర కుమార్ — సంపాదకులు

సంపాదకీయం

ఆర్య సమాజం అవతరించి వంద ఏళ్ళు గడిచాయి. అయినా అనేకులకు ఆర్య సమాజం అంటే ఏమిటో తెలియదు. తెలిసిన వారికి కూడ, వారు వెలిబుచ్చే అభిప్రాయాల్ని బట్టి సరియైన అవగాహన లేదని చెప్ప వలసివస్తుంది. ఆర్య సమాజం విగ్రహారాధనని నిరసిస్తుంది కాబట్టి ఇదొక నాస్తిక సమాజమని కొందరంటారు· హిందూ మత సంస్కరణకు అవతరించిన సంస్థ అని మరికొందరి అభిప్రాయము· దీనిని కులాంతర వివాహలు జరిపించే సంస్థగా భావించే వారు కూడా లేక పోలేదు. ఆర్య సమాజం నిర్వహించు కొన్ని పనులను దృష్టిలో ఉంచుకొని ఇట్టి అభిప్రాయాల ఏర్పడ్డాయి.

కాని ఆర్య సమాజం వేద ప్రతిపాదిత జీవన విధానాన్ని ప్రచారం గావించే సంస్థ ఈ జీవన విధానం వ్యక్తిని నీతి-నీజాయితీ గల శ్రేష్ఠమైన వ్యక్తిగా తీర్చి దిద్దుతుంది. సంఘానికి మూల ప్రమాణం వ్యక్తి. శ్రేష్ఠమైన వ్యక్తులు గల సంఘమే సుఖశాంతులతో తులదూగుతుంది. అందు అన్యాయానికి అక్రమాలకు తావుండదు. ఇట్టి శ్రేష్ఠ సమాజ నిర్మాణమే ఆర్య సమాజ ధ్యేయం. అందుకే ఆర్య సమాజం "కృణ్వంతో విశ్వమార్యమ్"—ప్రపంచ మానవుల నందరినీ శ్రేష్ఠులుగా జేయుము—అను వేద ఆదేశమును తన నినాదంగా ఎన్నుకొన్నది.

ఇట్టి ఆశయసిద్ధికై ఆర్య సమాజం ఎట్లు కృషిచేస్తున్నదో ఈ చిన్నిపుస్తకంలో సంగ్రహంగా వివరింపబడింది.

హిందీ మహా విద్యాలయ మాజీ ఆచార్యులు శ్రీ పండిత కృష్ణ దత్త్ గారి హిందీ రచనకు లోక లక్ష్మీ నారాయణ గారి అనువాద మిది. వారికి మా కృతజ్ఞతలు.

పండిత కృష్ణ దత్త్ గారు, "వైదిక సాహిత్యమాల" జరుపుతూ వున్న కృషిని అభినందించి దానికి తమ సంపూర్ణ సహకారాన్ని అంద జేస్తున్నారు. వారికి మే మెంతయో ఋణపడి ఉన్నాము.

ఈ పుస్తక పఠనంద్వారా ఆర్య సమాజ నిజస్వరూపాన్ని, ఉద్దే శ్యాలని గ్రహించి, అవి సలుపు కృషియందు మీరూ పాల్గొంటారని ఆశిస్తూ—

—సంపాదకులు

పింగళ ఫాల్గుణ శు॥ ౧౫
హోలి.
దివి. 24-మార్చి-1978.

ఓ౩మ్

ఆ ర్య స మా జ ము

స్వ రూ ప ము – కా ర్య క లా ప ము లు

ఆర్యసమాజము 'ఆర్య,' 'సమాజము' అనెడు రెండు శబ్దములతో ఏర్పడినది. పాశ్చాత్య విద్వాంసులు 'ఆర్య' శబ్దమును జాతిపరముగ ప్రయోగించిరి. కాని యిది గుణ వాచక శబ్దమని మన భారతీయ పరంపర చాటి చెప్పుచున్నది. శ్రేష్ఠజనులను ఆర్యులని, దుష్టులను దస్యులని యందురు. తానును ఇట్లే విశ్వసిస్తున్నానని మహర్షి దయానంద సరస్వతి "స్వమంత వ్యామంతవ్య ప్రకాశము" నందు స్పష్టమొనర్చి నారు. అందువలన "ఆర్య" శబ్దము గుణవాచక శబ్దమే అని తెలియు చున్నది ఇట్టి శ్రేష్ఠజనుల సమాజమే ఆర్య సమాజము. ఇది జన్మను, జాతిని బట్టి యేర్పడిన సంస్థ కాదు. దీనికి స్వీయ నియమములు, ఉపనియమములు కలవు. ఈ నియమములకు బద్ధుడై దీనిలో సభ్యుడుగా చేరిన ఏవ్యక్తియైనను ఆర్యసామాజికు డనబడును. ఆర్య సమాజము మత సంస్థగాని, సంప్రదాయము గాని కాదు. ఇది వైదిక ధర్మ ప్రచారము చేయుటకు జన్మించిన ఒక ధార్మి సంస్థ. మహర్షిదయానంద సరస్వతి దీని సంస్థాపకులు.

భారతదేశమున ధర్మముపేర పాషండము. అంధవిశ్వాసము, మూఢాచారములు ప్రబలియున్న కాలమది. జనులు మూల ధర్మమును

మరచి వివిధ మూఢాచారములను, అంధవిశ్వాసములనే ధర్మమని తలంచుచుండిరి. వైదిక ధర్మమునందు శ్రద్ధగల వారిపై విదేశమత ప్రచారకులు అన్నివైపుల నుండి ఆక్రమణ చేయసాగిరి. భారతీయుల మనో మస్తిష్కములందు పాశ్చాత్య నాగరికతా ప్రభావము హత్తుకొని పోయి, వారు తమను దీనహీనులుగ భావింపసాగిరి. ఇట్టి విపత్కర సమయమున మహర్షి దయానంద సరస్వతి జనన మొంది క్రీ. శ. 1875 లో ఆర్యసమాజమును స్థాపించిరి. మహర్షి యొక్క దిగువ వాక్యములను చదివిన ఆర్యసమాజ స్థాపనోద్దేశము స్పష్టమగును :—

'స్వదేశాది సర్వజనుల నిర్విఘ్నమైన హితము ఆర్య సమాజము వలననే సిద్ధించును' (శ్రీ గోపాలరావు దేశముఖ్ గారికి మహర్షి వ్రాసిన లేఖ)

'ఉన్నతిని బడయదలచినచో ఆర్య సమాజమునందు చేరి దాని ఉద్దేశముల ననుసరించి నడచుకొనుట కంగీకరింపుడు. లేనిచో నేమియు సిద్ధింపజాలదు............ఆర్యావర్త దేశము యొక్క అభ్యున్నతికి ఆర్య సమాజము కారణభూతమైనంతగ మరొక సంస్థ యేదియును కాజాలదు. (సత్యార్థప్రకాశము, 11వ స.)

ధార్మిక స్వరూపము.—

మహర్షి దయానంద సరస్వతి మరియు ఆర్య సమాజము వేదమును, వేదానుకూలమైన గ్రంథములను మాత్రమే ధర్మగ్రంథములుగా అంగీకరించెను ఆర్య సమాజము అనేక దేవీ దేవతలను, అవతారవాదమును అంగీకరింపదు. అది సర్వశక్తిమంతుడు, సర్వ

వ్యాపకుడు, నిరాకారుడునైన ఒకే పరమేశ్వరుని భక్తి, ఉపాసన. నొనర్చుటకు ప్రబోధించును. అది ఆస్తిక్యమునే ప్రచార మొనర్చును నాస్తికతను నిర్మూలింప యత్నించును. ఆచరణ శూన్యము లైనట్టి కేవల విశ్వాసములను ధర్మమని యంగీకరింపదు. ధర్మమునకు మహర్షి యొనర్చిన వ్యాఖ్యను గమనింపుడు— 'పక్షపాతరహితమును; న్యాయాచరణ., సత్యభాషణాదులతో కూడి వేదవిరుద్ధము కానట్టి ఈశ్వరాజ్ఞ యేది కలదో దానిని 'ధర్మ' మనియు; పక్షపాత సహితమును; అన్యాయాచరణము, మిథ్యాభాషణాదులతో కూడి, వేదవిరుద్ధమును, ఈశ్వరాజ్ఞ భంగమొ నర్చునదియు నైనదానిని 'అధర్మ' మని భావింతును' (సత్యార్థ ప్ర.)

మహర్షి దయానంద సరస్వతి ఉపాసనాపద్ధతిని, సాప్తాహిక యజ్ఞవిధిని, షోడశ సంస్కార విధానమును నిర్ణయించిరి. సాప్తాహిక సత్సంగముల ద్వారా సామూహిక ఉపాసనా పద్ధతిని ప్రచారము చేసిరి.

సంఘసంస్కరణము;—

ఆర్య సమాజము బహుభార్యాత్వమును, బాల్య, వృద్ధ వివాహములను, ఈడుజోడు లేని వివాహములను వ్యతిరేకించును. కనీస వివాహ వయస్సును నిర్ణయించి ప్రభుత్వము చేత శారదా చట్టము నంగీకరింపజేసినది. వితంతు వివాహములను ప్రచారము చేయుటకు దానికి చట్టరూపము నిప్పించినది. వితంతు వివాహము క్రీ. శ.1856 లోనే చట్టబద్ధమొనరంబడినను వారి సంతానమునకు ఉత్తరాధికారములేకుండెను. చట్టములలోని యీ లోపమును గుర్తించి మహర్షి దయానందులు క్రీ.శ. 1880 లో అప్పటి గవర్నరు జనరలుకు వినతి పత్రము సమర్పించి

వితంతువులకు పునర్వివాహము తరువాత కలిగెడు సంతానమునకు ఉత్తరాధికారము లభించునట్లు కృషిచేసిరి. (ఆర్య డైరెక్టరీ నుండి)

ఆర్యసమాజము వర్ణవ్యవస్థకు ఆధారము జన్మయని విశ్వసింపదు. అది గుణకర్మ స్వభావములపై ఆధారపడిన వర్ణవ్యవస్థను ప్రతిపాదించును ఆర్యసమాజము జన్మనుబట్టి యేర్పడు వర్ణవ్యవస్థను విశ్వసింపదు. ఇది దళితజనోద్ధరణ, హరిజనోద్ధరణ ఉద్యమముల ద్వారా సమాజములోని అన్నివర్గముల సమానత్వమునకై కృషిచేసినది. సవర్ణ భోజనమును జన్మసిద్ధవర్ణ విధానమును వ్యతిరేకించి, అంతర్జాతీయ వివాహములను ప్రోత్సహించి సమాజములోని ఉచ్చనీచ భేదభావములను రూపుమాపినది. ఇట్టి వివాహములను చట్టబద్ధమొనర్చునట్టి శాసనమును కూడ చేయించినది. క్రైస్తవులును, మహమ్మదీయులును హిందువులను తమ మతములలోనికి మార్చి తమ సంఖ్యను పెంచుకొనుటయే గాక వారిలో విజాతీయ, విదేశీయ భావనలను కూడ వ్యాపింపజేయు చుండిరి. ఆర్య సమాజము శుద్ధి ఉద్యమము ద్వారా క్రైస్తవులు, మహ్మదీయులు చేయు మత పరివర్తన కార్యములను నిరోధించినది. మాంసాహారము, గోవధ మున్నగువానిని రూపుమాపుటకై ఉద్యమములనడిపినది. స్వామి దయానంద సరస్వతి "గోకరుణానిధి" యనుపుస్తకము వ్రాసి గోవుయొక్క ఆర్థిక ప్రాముఖ్యతను తెలిపి వ్యవసాయ ప్రధానమైన భారతదేశములో గోసంపదకు గల ప్రాముఖ్య మెంతటిదో ఋజువు చేసిరి. వారు గోవధ నిషేధమునకై చేసిన రెండు ప్రయత్నములను ఇచట పేర్కొనుట అవసరము. క్రీ. శ. 1866 లో స్వామీజీ అజ్మీరులో రాజస్థాన్ రాజకీయ ప్రతినిధియైన "కర్నల్ బ్రూక్స్"ను కలిసికొని గోవధనిషేధమునకై వారిని ప్రేరేపించిరి. క్రీ. శ. 1882 లో రాజులు, ధనవంతులు మరియు

సామాన్య ప్రజలనుండి మూడుకోట్ల సంతకములను సేకరించి గోవధ నిషేధమునకై ఒక ప్రార్థనా పత్రమును విక్టోరియా మహారాణికి పంపుటకు కృషిచేసిరి. ఇట్టి పత్రముపై ఉదయపూర్, జోధపూర్, బూంది, జయపూర్ మహారాజులు సంతకము చేసిరి. జయపూర్ మహారాజు సంతకము గైకొనుటకు స్వామీజీ స్వయముగ జయపూర్ వెళ్లిరి. గాని స్వామీజీ జీవితకాలములో ఈ కార్యము సఫలము కాలేకపోయెను. మరుసటి సంవత్సరమే వారు అస్తమించిరి. గోవధనిషేధమునకై జరిగిన ఉద్యమములన్నింటిలోను ఆర్యసమాజము సంపూర్ణ భక్తిశ్రద్ధలతో పాల్గొని తన ధనజనశక్తిని ఉద్యమ సాఫల్యమునకై సమర్పించినది.

మహర్షిదయానంద సరస్వతి మాతృభాష గుజరాతి యైనను, వారు సంస్కృతములో ప్రకాండ పండితులైనను, హిందీని, ఆర్యభాషగా పేర్కొని దానిని భారతదేశ ప్రజల భాషగా భావించి, ఆర్యసమాజ ప్రచారమునకు దానిని సాధనముగా జేసికొనిరి. వారు హిందీలో 15 వేల పుటల సాహిత్యాన్ని రచించి ప్రజలకు అదించిరి. వేదాలకు హిందీలో భాష్యము వ్రాసినమొదటివ్యక్తి వీరే. అంతేకాదు హిందీలో ఆత్మకథ వ్రాసిన మొదటి వారు కూడ వీరే. ప్రభుత్వ వ్యవహారములన్నియు హిందీలోనే జరింపించవలెనని లక్షల ప్రజల సంతకాలను సేకరించి ప్రభుత్వమునకు వినతి పత్రము సమర్పించి ఉద్యమము కూడ నడిపిరి. కాని ఈ ఉద్యమము సఫలము కాకపూర్వమే స్వామీజీ జీవితము సమాప్తము గావింపబడెను. వారి పిదప ఆర్యసమాము హిందీ ప్రచారానికి గొప్ప కృషిచేసినది. హిందీ జగత్తునకు అనేక పత్రికలను, విస్తృత సాహిత్యమును, గొప్పకవులను, సాహితీ వేత్తలను సమకూర్చినది. హిందీయేతర ప్రాంతాలలో కూడ ఆర్యసమాజము హిందీ ప్రచారము

చేసినది. ఈ కార్యాన్ని అది జాతీయ భావనా ప్రేరితమై చేపట్టి నేటికిని నిరాఘాటముగ కొనసాగించుచున్నది.

విద్యా వ్యాప్తి :—

వ్యక్తి మరియు సమాజ నిర్మాణములో అధ్యయన అధ్యాపనములకు చాల ప్రముఖమైన పాత్రగలదు. స్వామి దయానందులు 'సత్యార్థ ప్రకాశము'లో రెండవ, మూడవ సముల్లాసములందు విద్య యొక్క అధ్యయన-అధ్యాపనముల ప్రాముఖ్యతను నొక్కి చెప్పిరి. విద్యావిషయములో బాలలకు సమానావకాశముల గురించి, ప్రభుత్వము ద్వారా నిర్బంధవిద్యను ప్రవేశపెట్టుటను గురించి మహర్షి వ్యక్తపరచిన అభిప్రాయమును గమనింపుడు.

"అందరికి సమానముగా భోజన, వస్త్ర, నివాసాది సౌకర్యాలు కలుగజేయవలెను. రాజకుమారుడైనా, రాజకుమారియైనా ధనికుడైనా, కటిక దరిద్రుడైనా అందరు అక్కడ తాపసిక జీవనమును గడుపవలెను." మరొకచోట "ఐదులేక యెనిమిది సంవత్సరములు దాటిన బాలబాలికలను తల్లిదండ్రులెవ్వరును తమ యిండ్లలో ఉంచుకొనరాదు. పాఠశాలలకు పంపవలెను. అట్లుచేయనివారు శిక్షార్హులని రాజనియమము, సంఘనియమము ఉడవలెను" అని వ్రాసిరి.

మహర్షిదయానందులు తమ జీవిత కాలములోనే తన భావములకు అనుగుణమైన విద్యావిధానమును ప్రచారము చేయుటకు విద్యా సంస్థలను. స్థాపించిరి. కాని వారిపిదప ఆర్యసహజము పాశ్చాత్య-భారతీయ విద్యా విధానముల కనుగుణముగా విద్యా ప్రచారానికి అనేక పాఠశాలలను,

కళాశాలలను, గురుకులాలను స్థాపించినది. వైదిక ధర్మ ప్రచారార్థము ప్రచారకులను తయారుచేయుటకై పెక్కుచోట్ల ఉపదేశక విద్యాలయ ములను స్థాపించినది. హిందీతో పాటు సంస్కృత విద్యాధ్యయన విషయమునను కడుశ్రద్ధ వహించినది. సంస్కృతభాషా మహత్త్వ మును పెంపొందించుటకును దాని అధ్యయనమును సులభము చేయుట కును ఆర్యసమాజము గొప్పకృషి చేసినది. గురుకులాలలో హిందీ సంస్కృత భాషలకే అధిక ప్రాధాన్య మీయబడుచున్నది. ఆయుర్వేద కళాశాలలు, వేదకళాశాలలు గూడ స్థాపించబడినవి. హరిద్వారములోని కాంగ్డీగురుకులము హిందీ భాషద్వారా విద్యాబోధ గావించిన మొదటి విశ్వవిద్యాలయము. దీనిని స్వామి శ్రద్ధానందులు క్రీ. శ. 1901 లో స్థాపించిరి. దేశవిభజనవలన ఆర్యసమాజము యొక్క విద్యా ప్రచార కార్యక్రమాలకు గొప్ప అంతరాయము కలిగినప్పటికిని, ఆర్యసమాజము ఈనాడును దేశవిదేశాలలో నాలుగైదువందల విద్యా సంస్థలపైన ప్రతి సంవత్సరము కోట్ల కొలది రూపాయలు వ్యయమొనర్చుచున్నది.

జాతీయభావము:—

స్వామి దయానంద సరస్వతి దేశములో జాతీయ చైతన్యమును, స్వాతంత్ర్యభావమును జాగృత పరచుటకు గొప్ప కృషిచేసిరి. "స్వదేశ ప్రభుత్వమే సర్వశ్రేష్ఠ ప్రభుత్వ" మని చాటి స్వామీజీ స్వాతంత్ర్యము యొక్క మహత్త్వమును ప్రకటించిరి. దేశ దానిసత్వమును గాంచి వారెంతగా దుఃఖించిరో వారి ఈ క్రింది మాటలు తెలుపుచున్నవి. "ఇప్పుడు దురదృష్టమున ఆర్యుల సోమరితనము, అజాగ్రత, పరస్పర విరోధముల వలన, ఇతరదేశములపై రాజ్యముచేయుట అటుంచి, ఆర్యా

వర్తమునందే ఆర్యుల యొక్క అఖండ, నిర్భయ, స్వతంత్ర, స్వరాజ్యము ఇప్పుడు లేదు. ఏ కొద్దిగానో ఉన్న, అదికూడ విదేశీయుల పాదాక్రాంతమగుచున్నది. కొద్దిమంది రాజులు మాత్రమే స్వతంత్రులుగా నున్నారు. చెడుకాలము వచ్చినపుడు దేశప్రజలు మిక్కిలి కష్టములను భవింపవలసియుండును" బానిసత్వానికి కారణములను వివరించుచు స్వామీజీ యిట్లు వ్రాసిరి;- "అన్నదమ్ములు పరస్పరము కలహించు కొన్నప్పుడే విదేశీయుడైన మూడవ వ్యక్తి వచ్చి పెత్తనము చేయును.

......ఈపాడురోగము మన ఆర్యుల నుండి దూరమైపోవునట్లు భగవంతుడు అనుగ్రహించుగాక" (సత్యార్థ ప్రకాశము).

మహర్షి దయానందులు స్వదేశవస్తువులను వాడుటయందును, స్వదేశ జీవన విధానమునందును, మిక్కిలి అభిమానము కలిగియుండ వలెనని నొక్కి చెప్పుచు ఆంగ్లేయులను ఉదాహరణగా పేర్కొనిరి. వారు విదేశీయులను గ్రుడ్డిగా అనుకరించుటను తీవ్రముగా వ్యతిరేకించిరి. ఈ విషయమున దిగువ పేర్కొనినవారి భావములపై ప్రత్యేకముగా శ్రద్ధవహించుట నేడును ఎంతయో అవసరము. "ఏ దేశముయొక్క వస్తుసామగ్రిలో ఈ శరీరము నిర్మితమై పోషింపబడుచున్నదో ఆదేశము యొక్క అభివృద్ధికై తను మనోధనముతో నెల్లరును కృషిచేయవలెను" ఈ విధముగా వారు భారతీయులలో దేశభక్తి భావములను జాగృత మొనర్చిరి. కావుననే ఆర్యసమాజ సభ్యులు జాతీయోద్యమాలన్నిటిలోను ఎవరికిని తీసిపోని విధముగ ముందడుగు వేయుచున్నారు. స్వామీ శ్రద్ధానందమహారాజ్, లాలాలజపతరాయ్, భాయీ పరమానంద్ జీవంటి శ్రేష్ఠరాజకీయనాయకులు ఆర్యసామాజికులే - అట్లే శ్యాంజీకృష్ణవర్మ, రాంప్రసాద్ బిస్మిల్, యశ్ పాల్, అజీత్‌సింహులవంటి విప్లవవీరులను కూడ ఆర్యసమాజముదేశానికి సమర్పించినది.

విదేశాలలో ప్రచారము:—

ప్రపంచదేశాలన్నిటిలో భారతీయులు నివసించుచున్నారు. మారిషస్ మున్నగు దేశాలలో వీరిసంఖ్య అత్యధికము – దక్షిణాఫ్రికాలోని పలు ప్రాంతాలలో భారతీయులసంఖ్య అధికముగా నున్నది. వీరిలో ధర్మము మరియు భారతీయ సంస్కృతీ ప్రచారప్రసారములకును, విద్యావ్యాప్తికిని ఆర్యసమాజము అనేక పండితులను ఆయా దేశములకు పంపి పెక్కు విద్యాలయములను స్థాపించినది. వారిలో హిందీ ప్రచారముగూడా చేసినది – వార్తాపత్రికలను నడిపినది, వైదిక సాహిత్య నిర్మాణ మొనర్చి వితరణ గావించినది. ప్రచారార్థము విదేశాలకు వెళ్ళిన పండితులలో, సన్న్యాసులలో మెహతా జయముని, స్వామి శంకరానంద, స్వతంత్రానందమహారాజ్, స్వామి సత్యదేవ్ పరివ్రాజకులు, పండిత అయోధ్యా ప్రసాద్, పండిత సత్యాచరణ్, స్వామీ ధ్రువానంద. పండిత బుద్ధదేవ్, పండిత ఉషర్‌బుధ, మహాత్మాఆనందస్వామి. శ్రీ ఓం ప్రకాశ్‌త్యాగీ. స్వామీ సత్యప్రకాశ్ సరస్వతి, పండిత మదనమోహన్ విద్యాసాగర్ మున్నగువారు ప్రముఖులు. స్వామీ భవానీదయాల్. డా. మాణిక్‌లాల్, బారిష్టరు చిరంజీలాల్ భరద్వాజ్, పం. అమిచంద్ విద్యాలంకార్ మున్నగు ప్రముఖులుగూడ ఈ సందర్భమున పేర్కొనదగినవారు. వీరంతా విదేశాలలో ఆర్యసమాజముల స్థాపన, హిందీభాషాప్రచారమును, విద్యాప్రచారప్రసార కార్యములను, విద్యాలయ, కళాశాల, గురుకుల, కన్యాగురుకులాదుల స్థాపనను, ధార్మిక పత్రికల సంచాలనము మున్నగు అనేక సేవాకార్యములను చేపట్టి వైదికధర్మమునకును, భారతీయ సంస్కృతికిని స్థిరత్వమును చేకూర్చినారు, ఇంకను చేకూర్చుచున్నారు. వీరి ప్రచారపరిశ్రమ ఫలితముగానే దక్షిణాఫ్రికా, తూర్పు ఆఫ్రికా, మారిషస్, ఫిజీ, దక్షిణ అమెరికా, కీనియా, యుగాండా, దారెసలాం, టాంజానియా, వెస్టిండీస్, స్యామ్, సింగపూర్, బ్రహ్మదేశము మున్నగు

దేశాలలో ఆర్యసమాజముల స్థాపన జరిగినది. ఇప్పటికిని సమాజసంస్థ లెన్నియో ఆ దేశములందు పనిచేయుచున్నవి.

మ తా తీ త స ం గ ఠ న ము ;—

ఆర్యసమాజము ఒక సంప్రదాయముగాని, మతముగానికాదు. జన్మననుసరించి పాటింపబడు కులమత సంప్రదాయములను ఇది విశ్వ సింపదు. అన్యమత సంప్రదాయవాదులు ఆర్యసమాజముపై అత్యాచా రాలు జరిపి ఆర్యసమాజ నాయకులయు, కార్యకర్తలయు రక్తమును ప్రవహింపజేసినారు, కాని ఆర్యసమాజము ఎవరికిని హానికలిగింపలేదు. సుదీర్ఘమైన దాని చరిత్రలో రక్తపాతకళంకము మచ్చుకైనాలేదు — మహర్షి దయానందసరస్వతి, పండితలేఖరాం, స్వామి శ్రద్ధానంద, రామచంద్ర, రాజపాల్, వేదప్రకాశ్, పండిత శ్యాంలాల్‌వంటి ఆర్య సమాజనాయకులును, నిష్ఠగల కార్యకర్తలును విషప్రయోగమునకు, కత్తిపోట్లకు, తుపాకి కాలువలకు బలిచేయబడినారు. క్రీ.శ. 1938—39 లో జరిగిన హైదరాబాదు - ఆర్యసత్యాగ్రహములో జైలు యాతనలకు గురియై 28 మంది ఆర్యసమాజధర్మవీరులు మరణించినారు.

కాబట్టి ఆర్యసమాజమును మతతత్త్వ సంస్థయనుట దాని పట్ల ఘోర అన్యాయము చేయుటే యగును. స్వామి దయానంద సరస్వతి స్పష్టమైన మాటలలో ఆర్యసమాజమును భారతీయులను ఇట్లు ఆదేశించి నారు "సజ్జనులందరు మిక్కిలి కృషిచేసి మత సంప్రదాయములను కూకటివేళ్లతో పెకిలించివేయవలెను అట్లు చేయజాలనిచో మనదేశ కల్యాణము ఎన్నటికిని సాధ్యము కాదు" ఈ ఆదేశము జాతి శ్రేయ స్సును, దేశకల్యాణమును దృష్టియందుంచు కొనియే ఇవ్వబడినది.

ఆర్యసమాజ దశ నియమాలు

1. సమస్త సత్య విద్యలకును విద్యచే నెఱుగబడు పదార్థములకును ఆది మూలము పరమేశ్వరుడు.
2. ఈశ్వరుడు సచ్చిదానంద స్వరూపుడు, నిరాకారుడు, సర్వ శక్తి మంతుడు, న్యాయకారి, దయాళువు, అజన్ముడు, అనంతుడు నిర్వి కారుడు, అనాది, అనుపముడు, సర్వాధారుడు, సర్వేశ్వరుడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, అజరుడు, అమరుడు అభయుడు, నిత్యుడు, పవిత్రుడు సృష్టికర్తయునై ఉన్నాడు అతనినే ఉపాసించుట తగును.
3. వేదము సమస్త సత్యవిద్యల పుస్తకము. వేదమును చదువుట చది వించుట, వినుట, వినిపించుట ఆర్యులందరి పరమ ధర్మము.
4. సత్యమును గ్రహించుటకును, అసత్యమును త్యజించుటకును, సర్వదా సంసిద్ధులై ఉండవలయును.
5. అన్ని పనులు ధర్మాను సారముగా అనగా సత్యాసత్యములను ఆలో చించి చేయవలెను.
6. ప్రపంచమున కుపకార మొనర్చుట ఈ సమాజము యొక్క ముఖ్యో ద్దేశ్యము. అనగా శారీరక, ఆత్మిక మరియు సామాజిక ఉన్నతిని బడయుట.
7. అందరితో ప్రేమపూర్వకముగా, ధర్మానుసారముగా, యథాయోగ్య ముగా వ్యవహరించవలయును.
8. అవిద్యను నశింపజేసి, విద్యను పెంపొందింప వలయును.
9. ప్రతి యొక్కరు తమ ఉన్నతి యందే సంతుష్టులు గాక, అందరి ఉన్నతిలో తమ ఉన్నతి నెంచవలయును.
10. మనుష్యులందరు సామాజిక-సర్వహితకరములగు నియమములను పాలించుటలో పరతంత్రులుగా నుండవలయును. మరియు వ్యక్తి హితకరములగు నియమములందు అందరు స్వతంత్రులుగా నుండ తగును.

వెల 30 పైసలు